క్లుప్తంగా

బీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మండలానికి చెందిన వెనక బడిన తరగతుల సంఘం నాయకులు లింగమయ్య, ప్రసాద్ గురువారం తెలంగాణ మోస్ట్ బ్యాక్వర్డ్ క్లాసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జరిపేటి జైపాల్‌ను కలిశారు. సన్మానించారు. వెనకబడిన తరగతుల సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు.

బాల్‌రాజుకు డాక్టరేట్



కామారెడ్డి టౌన్ : మిజోరం కేంద్రీయ విశ్వవిద్యాలయంలో జిల్లాకు చెందిన బాల్‌రాజు ఫారెస్ట్రీలో పరిశోధన పూర్తిచేసి డాక్టరేట్ పట్టాను పొందారు. జుక్కల్ పడంపల్లికి చెందిన విద్యార్థి బాల్‌రాజు కేంద్రీయ విశ్వ విద్యాలయంలో ఫారెస్ట్రీలో డేంద్రో కెమికల్ అనాలసిస్ విభాగంలో పరిశోధన పూర్తిచేసి డాక్టరేట్ పట్టాను పొందారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



బీబీపేట: విద్యార్థుల్లో ఉన్నటువంటి నైపుణ్యతను గుర్తించి వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాలని బీబీపేట టీఎస్ఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవీంద్రరెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో 19 మండల స్థాయి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులందించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి




కామారెడ్డి రూరల్ : హరితహారంలో భాగంగా చేపట్టిన నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీవో మలహరి సూచించారు. బుధవారం మండలంలోని శాబ్దిపూర్, శాబ్దిపూర్ లెప్ట్ తండా గ్రామాల్లో ఆయన పర్యటించారు. చోట్ల వ్యవసాయ బోరు బావుల నుండి నీటిని అద్దెకు తీసుకుని ప్రజలకు అందించాలన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు గణేష్, కృష్ణ, నర్సరీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బుధవారం దొడ్డి కొమురయ్య 97వ జయంతి వేడుకలు కుర్మ యాదవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కురుమ యువ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్, లింగంపేట మండల గొర్రెలు, మేకలు పెంపకందార్ల సంఘం చైర్మన్ మొకిరె బైరయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తదితరులున్నారు.

కామారెడ్డి పట్టణంలో..



కామారెడ్డి టౌన్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ముందు ప్రజా సంఘాలు, న్యాయవాద జేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రోడ్లపై వడ్లతో ఇబ్బందులు

- దర్జాగా ఆరబోస్తున్న రైతులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు





అంకోల్-హాజీపూర్ రోడ్డుపై రైతులు ఆరబోసిన వడ్లు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : వరి కోతలు మొదలవ్వడంతో రైతులు వడ్లను రోడ్ల పైనే ఆరబోస్తున్నారు. దీనితో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఓవైపు కొనుగోలు కేంద్రాల్లో ఉన్న మద్దతు ధర కంటే దళారుల వద్ద అధిక ధర పలకడంతో రైతుల దళారులకు విక్రయించడానికే ఆసక్తి కనబరుస్తున్నారు. దీనితో వాటిని ఆరబెట్టి అమ్మితే అధిక ధర పలుకుతుందన్న ఉద్దేశ్యంతో రైతులు రోడ్ల పైనే ఆరబోస్తున్నారు. రోడ్లపైన ధాన్యం ఆరబోయడంతో గతంలో రోడ్డు ప్రమాదాల వల్ల బైక్‌పై వెళ్తున్న వాహనదారులు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. అంకోల్-హాజీపూర్ రహదారి నూతన రోడ్డు అవ్వడంతో ఇరువైపులా వడ్లను ఆరబోస్తున్నారు. దీనితో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే అవకాశాలు లేక పోలేదని వాహనదారుల వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

రోడ్డుపై వడ్లను ఆరబోయడంతో ప్రమాదాలు జరుగుతుంటాయని వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అంకోల్-హాజీపూర్ రహదారి, లింగపల్లి-బొప్పాస్ పల్లి, బొమ్మన్‌దేవ్‌పల్లి, నెమ్లి, బస్వాయి పల్లి, మిర్జాపూర్ గ్రామాల్లో రోడ్డుపైన వడ్లను ఆరబోశారు. అయితే ఆయా గ్రామాల రైతులకు అధికారులు అవగాహన కల్పించడం లో అలసత్వం కన్పిస్తుంది.

ఒకవైపే ఆరబోయాలి

రోడ్డుపై ఇరువైపులా వడ్లను ఆరబోస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. రైతులు ఒక వైపున వడ్లను ఆరబోసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చు. వరికుప్పలపై నల్లటి బార్ దాన్లను కాకుండా మెరిసేటివి వేస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటుంది. – లావణ్య, ఎస్సై,నస్రుల్లాబాద్

ఆధ్యాత్మికం

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం క్యాంప్‌లో మొండి బసవేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు విరాళాలు సేకరిస్తున్నారు. బుధవారం గ్రామానికి చెందిన యువకుడు కోటగిరి అనిల్‌కుమార్ రూ. 51 వేల నగదును గ్రామపెద్దలకు అందజేశారు. అలాగే రాందీన్ సుభాష్ రూ. 11 వేలు విరాళం అందించారు. విరాళాలు ఇవ్వాలనుకున్న వారు ఆలయ పునర్మిర్మాణ కమిటీ కన్వీనర్ రాందీన్ సుభాష్‌కు 99491 94978ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండ శ్రీశైలం, కొండ సాయిలు, రతన్, రమేష్,నన్యానాయక్, భీమ్‌సింగ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎల్లమ్మ ఉత్సవాలు



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఇంటికో బోనం చొప్పున అందంగా అలంకరించి మహిళలు నెత్తిన పెట్టుకుని డప్పు చప్పుళ్ల మధ్య గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఊరేగించి ఆలయం వరకు వెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం బుధవారం సాయంత్రం తిరుగు బోనాలను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితులకు విందులు ఇవ్వడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

ముగిసిన సిద్ధరామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

భిక్కనూరు : దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వరాస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. బుధవారం ఆలయంలో పూర్ణహుతి కార్యక్రమంను నిర్వహించారు. గత



ఐదు రోజులుగా నిర్వహించిన బ్రహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రామగిరిశర్మ, సదాశివ మహంత్, ఆలయ ఈవో శ్రీధర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో శాంతిహోమం..



మాచారెడ్డి : మండలంలోని గజ్యానాయక్ తండాలో జెగదాంబ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఆలయంలో బుధవారం శాంతి హోమం నిర్వహించారు. ఉదయం అగ్నిముఖం, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు ఘనంగా జరిపించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.

వైభవంగా హోమం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో రుద్రాభిషేకాలు చేశారు. భక్తులు రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజయ్య, ఆలయ కమిటీ ప్రతినిధులు రాజిరెడ్డి, నడ్పి గంగయ్య, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోకు సన్మానం



భిక్కనూరు : మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమితులైన ప్రవీన్‌కుమార్‌ను రామేశ్వర్‌పల్లి మాజీ సర్పంచ్ పోతిరెడ్డి బుధవారం సన్మానించారు. పూలమాలతో శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాలిరెడ్డి పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన గుమస్తా యశస్విని నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి ఎంపికైంది. పిట్లం మండల కేంద్రంలోని వివేకానంద హైస్కూల్‌లో చదువుతున్న యశస్విని నవోదయకు ఎంపిక కావడంపై తల్లిదండ్రులు గుమస్తా సుస్మిత, సురేందర్ హర్షం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



కామారెడ్డి క్రైం : సైబర్ నేరాలకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కామారెడ్డి మండలం సరంపల్లి వద్ద గి రిజన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులకు దేవునిపల్లి పోలీసులు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్సై రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు.

శివాజీ అడుగుజాడల్లో నడవాలి





ఎల్లారెడ్డిలో శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, గాంధారిలో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో అంబేడ్కర్ సంఘం నాయకులు బుధవారం ఛత్రపతి శివాజీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు బబ్లూ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలో..

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో శివాజీ చౌక్ వద్ద బుధవారం ఛత్రపతి శివాజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పలువురు యువకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులకు పరుగుపందెం



బాన్సువాడ రూరల్ : నారి ఫిట్‌తో ఇండియా హిట్ (స్త్రీ శక్తివంతురాలైతే దేశం విజయం సాధిస్తుంది) అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం సోమేశ్వర్ శివారులోని ఎస్ఎస్ఎల్ ప్రైవేట్ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో పరుగుపందెం పోటీలు నిర్వహించారు. ఎన్‌వైకే వలంటీర్ సునీల్‌రాథోడ్ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. పరుగు పందెంలో విజయం సాధించిన వారికి ప్రిన్సిపల్ అరుణ్ రెడ్డి, సేవాసంఘ్ యూత్ సభ్యులతోకలిసి బహుమతులు అందజేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటాలి



బాన్సువాడ రూరల్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించబడిన సురేష్‌షెట్కార్‌కు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు మంత్రి గణేష్ సూచించారు. బుధవారం మండలంలోని కోనాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొండమీది రాములు, ఉపాధ్యక్షులుగా గాండ్ల సాయిలు,బంజ సోమప్ప, అబ్దుల్ అక్తర్, ప్రధాన కార్యదర్శిగా నాగులూరి లక్ష్మినారాయణను ఎన్నుకున్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించరాదు

ఎల్లారెడ్డి : ఎన్నికల విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. బుధవారం మోడల్ డిగ్రీ కళాశాలల్లో పీవో, ఏపీవోల శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవోలు వారికి కేటాయించిన పోలింగ్ సిబ్బందితో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్‌కుమార్, సెక్టార్ ఆఫీసర్లు వెంకటేశం, పుట్ట సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్

ఇంటి దొంగను పట్టించిన హుండీ

- వైరల్‌గా మారిన 'సాక్షి' కథనం

భిక్కనూరు : ఆలయంలో పనిచేస్తూ అదే ఆలయంలో చోరీకి యత్నించిన వ్యక్తికి సంబంధించిన వార్త 'సాక్షి' మెయిన్ ఎడిషన్‌లో బుధవారం ప్రచురితం కాగా వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. భిక్కనూరు మండలంలోని మాసుపల్లి పోశమ్మ ఆలయంలో పనిచేసే సురేశ్ సోమవారం రాత్రి హుండీలో డబ్బులు చోరీ చేసేందుకు ప్రయత్నించి అందులోనే చేయి ఇరుక్కుపోవడంతో రాత్రంతా ఆలయంలోనే ఉండిపోయాడు. దీనికి సంబంధించిన కథనంసాక్షిలో మెయిన్ పేజీలో కథనం ప్రచురితం కాగా ఈ క్లిప్పింగ్‌లను పలు హిందూ సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు తమ సోషల్ మీడియా ఖాతాల్లో వైరల్ చేశాయి. 'దేవుడున్నాడు.. జాగ్రత్త' క్యాప్షన్‌తో నిర్మల్ హిందూసేన సంస్థ తన వాట్సప్ గ్రూప్‌లో ఈ కథనాన్ని వైరల్ చేసింది.



హిందూసేన సంస్థ సోషల్ మీడియాలో పెట్టిన సాక్షి క్లిప్పింగ్

జహీరాబాద్‌ను కైవసం చేసుకుంటాం

లింగంపేట(ఎల్లారెడ్డి): జహీరాబాద్ పార్లమెంటు స్థానంలో సురేష్‌శెట్కార్ గెలిపించుకుని కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీయొద్దీన్ వెల్లడించారు. బుధవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 15 పార్లమెంటు స్థానాలు కాంగ్రెస్ పార్టీ కై వసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డి శాసన సభ్యులు మదన్ మోహన్‌రావు నేతృత్వంలో లక్ష మెజార్టీనీ సాధిస్తామన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి ఓటు వేసినట్లేనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మాజీ ఉపాధ్యక్షుడు ఫతియొద్దిన్, రాష్ట్ర నాయీబ్రహ్మణ ఉపాధ్యక్షుడు జొన్నల రాజు, మండల మైనార్టీ నాయకుడు ఇర్ఫాన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న రఫీయొద్దీన్

బాల్య వివాహాలతో అనారోగ్యాలు

కామారెడ్డి టౌన్ : బాల్య వివాహాలు చేస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ తెలిపారు.

బుధవారం మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి అంగన్‌వాడి కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు బాల్యవివాహాలు దాని వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, మంగ, పద్మ, అనసూయ ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

సమాచారం..

నేడు తాడ్వాయి మండల సర్వసభ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు జరిగే మండల సర్వసభ్య సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో కేవలం ఎంపిటీసీలు మాత్రమే సమావేశానికి హాజరవుతారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో కొన్ని గ్రామాలలో తాగునీటి సమస్యలు ప్రారంభమయ్యాయి. కరెంటు సమస్యలూ ఉన్నాయి. ఎంపీటీసీలు ఎంతవరకు ఈ సమస్యలను లేవనెత్తుతారో తెలియాల్సి ఉంది. మండలంలో 18 గ్రామాలకు గాను 9 మంది ఎంపీటీసీలు ఉన్నారు.

9న పంచాగ పఠనం

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్‌లో కొలువుదీరిన సరస్వతి మహాక్షేత్రంలో ఈ నెల 9న ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయంలో సాయంత్రం 4 గంటలకు వేద పండితుడు బ్రహ్మశ్రీ గంగవరం ఆంజనేయశర్మచే పంచాగపఠనం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్ తెలిపారు.

దళారులకు అమ్మి మోసపోవద్దు



పెద్దకొడప్‌గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ దశరథ్



ఎల్లారెడ్డిలో..



మంగ్లూర్‌లో..



రాజంపేటలో..

జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం పెద్దకొడప్‌గల్‌లో, ఎల్లారెడ్డిలో, నిజాంసాగర్ పరిధిలో, రాజంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. – పెద్దకొడప్‌గల్/ఎల్లారెడ్డి/నిజాంసాగర్/రాజంపేట

సంక్షిప్తం

తాడ్వాయి రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకిటి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుర్కంటి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుర్కంటి జగంరెడ్డి, కోశాధికారిగా జంగన్నగారి రాజేశ్వర్‌రెడ్డి, కార్యదర్శిగా తూర్పుపెద్దరాజిరెడ్డి, సంఘం ఇంచార్జిగా సంజీవరెడ్డిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సిబ్బందిని మానసిక ఒత్తిడికి గురిచేయవద్దు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో బుధవారం ఉపాధిహామీ సిబ్బంది సంతాపం తెలిపారు. మహబూబ్‌బాద్ జిల్లాని కొత్తగూడెం మండలంలో ఉపాధిహామీలో సాంకేతిక సహాయకుడిగా పనిచేస్తున్న నాగార్జున గుండె పోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టీఏ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణాగౌడ్ మాట్లాడుతూ సిబ్బందిని మానసిక ఒత్తిడికి గురిచేయవద్దన్నారు.

ఫిజియోథెరపీ శిబిరం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : పట్టణంలోని భవిత కార్యాలయంలో అంగవైకల్యం ఉన్న చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు డాక్టర్ అరుణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

నియామకం

కామారెడ్డి టౌన్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా బాన్సువాడ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాత బాలకృష్ణను నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జుక్కల్ నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడిగా బొడ్ల బాలరాజును నియమించినట్లు తెలిపారు.

సింగిడి కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలి



కామారెడ్డి టౌన్ : ఏబీవీపీ రాష్ట్రీయ కళామంచ్ సింగిడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవహ సంతోష్ జీ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ ఆండ్ సైన్స్ డిగ్రీ కళాశాల ఎదుట వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 20, 21 తేదీల్లో ఓయూలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్ కుమార్, జిల్లా ప్రముఖ్ గిరి, జిల్లా కన్వీనర్ చరణ్, జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ జిల్లా సమన్వయకర్త రాజీనామా

కామారెడ్డి టౌన్ : బీఆర్ఎస్ పార్టీ జిల్లా సమన్వయ కర్త మామిండ్ల అంజయ్య ఆ పదవికి రాజీనామా చేశారు. రాజీనామాను ఆమోదించాలని లేఖను నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌కు అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపుకు శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

నకిలీ విత్తన విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి

బాన్సువాడ : బీర్కూర్‌కు చెందిన పలువురు రైతుల కు నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని బుధవారం బీర్కూర్ పోలీస్టేషన్‌లో రైతులు పిర్యాదు చేశారు. బీర్కూర్‌కు చెందిన పలువురు రైతులు గ్రోమోర్ దుకాణంలో ఆర్‌కే మసూరి విత్తనాలను కొనుగోలు చేసి నారు పోశారని అన్నారు. పంట పూర్తిగా పొల్లు పోయిందన్నారు.